

పంట నమోదు తప్పనిసరి : ఎఓ



రైతులకు సూచనలిస్తున్న ఎఓ

కడప సిటీ : రైతులు తమ పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నానేపల్లి, దేవునికడప ప్రాంతాల్లో సాగు చేసిన వరి పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ వరిలో ఆకు ముడత తెగులు ఉందన్నారు. నివారణకు ఎటువంటి మందులను పిచికారి చేయాల్సిన అవసరం లేదన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించి, పొటాష్ వాడకాన్ని రెట్టింపు చేయాలన్నారు. ఆకుముడత తెగులు కారణంగా అధిక ముడతకు గురవుతాయన్నారు. దీనికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డులతో వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎఇఒలు పాల్గొన్నారు.



ఈ ఏడాది జిల్లాలో రైతులు ఆరుతడి పంటల వైపు అధికంగా మొగ్గు చూపుతున్నారు. వరిసాగుకు సుముఖంగా ఉన్నప్పటికీ సరైన వర్షాలు లేకపోవడం, రిజర్వాయర్లలో పూర్తి స్థాయిలో నీరు లేకపోవడంతో ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న, పూల మొక్కలు, కూరగాయల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో పత్తి పంట సాగుకు రైతులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో 70 వేల ఎకరాలకు పైగా పత్తి పంటను రైతులు సాగు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాత మినుము, మొక్కజొన్న పంటలు అధికంగా సాగు చేసే చర్యలకు సిద్ధపడుతున్నారు.

ఆశలన్నీ.. ఆరుతడి పైనే!

జిల్లాలో పెరగనున్న సాగు
పత్తి, మినుము, మొక్కజొన్న పైనే మొగ్గు



ఆరుతడి పంటల సాగు కోసం పచ్చిరొట్టను దున్నిస్తున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

కెసి పరిధిలో గతంలో వరి పంటను అధికంగా సాగు చేసే మండలాలైన చాపాడు, దువ్వూరు, మైదుకూరు, చెన్నూరు, ఖాజీపేట వల్లూరులలో సైతం ప్రత్యామ్నాయ పంటల వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. మైదుకూరు నియోజకవర్గ పరిధిలోనే సుమారుగా 40వేల ఎకరాలు వరకు వరి సాగు స్థానంలో ఇతర పంటలు సాగు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వరి ధాన్యం ధరలు బాగా ఉండటంతో సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. వరి పంట సాగుకు అవసరమైన నీరు లేకపోవడంతో వెనుకంజ వేస్తున్నారు. కుందూ, పెన్నా, బ్రహ్మసాగర్ పరిధిలో అవకాశమున్న మేరకు రైతులు మాత్రం వరి పంటను సాగు చేశారు. కెసి పరిధిలో వరి సాగుకు ముందుగా పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసి ప్రస్తుతం చెడగొడుతున్నారు. ఆరుతడి పంటలకు సిద్ధం చేస్తున్నారు. పత్తి పంటకు గత ఏడాది మంచి ధర పలకడంతో రైతులు పత్తి పంట సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎకరా పత్తికి రూ. 70 వేలకు పైగా ఆదాయం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. మొక్కజొన్న పంట సాగు చేపడితే ఎకరాకు మూడు టన్నుల దిగుబడి వచ్చినా టన్ను రూ. 20 వేల వరకు ధరలు ఉండడంతో మొక్కజొన్న సాగు వైపు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. మొక్కజొన్న సాగుకు ఎకరాకు రూ 20వేల వరకు మాత్రమే ఖర్చులు అవుతాయని రూ. 40 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో మైలవరం, రాజుపాలెం, వేముల, తొండూరు, వినన్‌పల్లి, పెద్దముడియం మండలాలలో ఐదు వేల ఎకరాలకు పైగా, కొండాపురం, కలసపాడు, బి.మఠం, పోరుమామిళ్ల, ఖాజీపేట, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, సింహాద్రిపురం, లింగాల, పులివెందుల, యర్రగుంట్ల, కమలాపురం, వల్లూరు మండలాలలో రెండు వేల ఎకరాల వరకూ ,మిగిలిన మండలాల్లో వంద ఎకరాల వరకు రైతులు పత్తి పంటను సాగుకు సమాయత్తమవుతున్నారు. మొత్తానికి ఖరీఫ్ లో జిల్లాలో 70 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు చేపట్టారు. సాధారణంగా ఎకరాకు 20 క్వింటాళ్ళ కు పైగా దిగుబడి వస్తుంది. దిగుబడి ఈ ఏడాది బాగుంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా పత్తి పంట సాగుకు రూ. 45 వేల నుండి 50 వేల వరకు సాగు ఖర్చులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

మినుము సాగుకు సిద్ధపడుతున్నాం



వరికి బదులు మినుము సాగుకు చర్యలు చేపడుతున్నాం. వరి సాగుకు ఏర్పాట్లు చేసి నీటి వసతి లేకపోవడంతో వెనకడుగు వేయవలసి వస్తుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాల్సి వస్తుంది. మినుము దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తున్నాం.

- అంజనేయులు రైతు,సిద్దారెడ్డిపల్లె.

మినుము, జొన్న విత్తనాల కోసం ప్రతిపాదనలు



మండల పరిధిలో ఆరుతడి పంటలు సాగు చేపట్టే రైతుల కోసం మినుము, జొన్న విత్తనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. 800 క్వింటాళ్ల మినుము, 300 క్వింటాళ్ల జొన్న విత్తనాలు అవసరమని కోరాం. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా కెసి కాలువకు నీటి విడుదల ఆలస్యం అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో వరి పంట సాగు తగ్గే అవకాశం కనిపిస్తుంది. ముందు జాగ్రత్తగా విత్తనాలను సిద్ధం చేస్తున్నాం. రైతుల అభ్యర్థన మేరకు మరిన్ని విత్తనాలు అవసరమైతే అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులకు అవసరమైన ఎరువులు ఆర్‌బికేలలో ఇప్పటికే సిద్ధంగా ఉంచాం.

- మ్యాగీ, ఎఒ, చాపాడు.

ఎన్నికల ఎత్తుగడ కోసమే గ్యాస్ ధర తగ్గింపు

మోడీ సర్కార్‌కు లొంగే పన్నుల భారాలు
సమరభేరిలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్



బద్వేల్ : సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎం.ఎ గఫూర్

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్యాస్ సిలిండర్ ధరలు నాలుగేళ్లలో ఎనిమిది సార్లు పెంచి ఒక్కసారిగా రూ. 200 తగ్గించడం ఐదు రాష్ట్రాల ఎన్నికల ఎత్తుగడ అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. సమరభేరిలో భాగంగా బుధవారం బుధవారం ఐటిఐ సర్కిల్ వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్యాస్ సిలిండర్ తగ్గించి మహిళ పట్ల మోడీ కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. సబ్సిడీలకు కోతపెట్టి, సిలిండర్ ధర ఏకంగా రూ. 800లకు పెంచి సామాన్యులపై మోయరాని భారం మోపి ఇప్పుడు కొంత మేర తగ్గించి ప్రజలను వంచించారని వాపోయారు. ప్రజా ఆందోళన ఒత్తిడి మేరకు ప్రభుత్వం గాస్ ధర కొద్ది మేర కైనా తగ్గించక తప్పలేదని పేర్కొన్నారు. వంటగ్యాస్‌ను రూ. 400 తగ్గించి , ఇప్పటివరకు రద్దు చేసిన సబ్సిడీ మొత్తాన్ని ప్రజల ఖాతాల్లో జమ చేసి తన చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలని చెప్పారు. వంద రోజుల్లో ధరలు తగ్గిస్తానని 2014లో హామీ ఇచ్చిన బిజెపి ,మోడీ నమ్మకద్రోహం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ,అంబానీ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ధరలు పెంచి దేశ ప్రజలను బలి చేశారు. దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని పేర్కొన్నారు. కార్పొరేట్లకు వూడిగం చేస్తూ సంస్కరణల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని, వైసిపి సర్కార్ పేదల ప్రభుత్వంగా చెబుతూ ధరలు, పన్నులు పెంచి ప్రజల గొంతు కోసిందని చెప్పారు. విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తానని నమ్మబలికి నేడు సర్దుబాటు పేరుతో భారాలు వేయటం మోసపూరితమని వెల్లడించారు. కార్పొరేట్ల దోపిడీ, పాలకుల అవినీతి అరికడితే విద్యుత్తును చౌకగా అందించవచ్చని, బియ్యం మొదలు కూరగాయల వరకు ధరలన్నీ పెరుగుతున్నా ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయని వాపోయారు. ప్రజాపంపిణీ వ్యవస్థను ఉద్దేశ పూర్వకంగా దెబ్బ తీస్తున్నారని, కందిపప్పు, పామాయిల్ తదితర నిత్యవసర సరుకుల సరఫరా నిలిపివేశారు. మోడీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలని ఊరించి ఉన్న ఉపాధికే ఎసరు పెట్టారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరు చెప్పి జగన్ యువతను వంచించారరన్నారు. చంద్రబాబు దేశాన్ని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన మోడీకి భజన చేయటం సిగ్గుచేటని, హోదాపై విభేదించానని చెబుతున్న చంద్రబాబు నాలుగేళ్లలో హోదాపై నోరు మెదపలేదని, సిపిఎం ధరలు, నిరుద్యోగంపై దేశవ్యాప్త ఆందోళన సాగిస్తోందని, సెప్టెంబర్ 4న ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి నిరసన తెలుపుతామని చెప్పారు. ప్రజలందరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామమోహన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, పాపిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, జమీల, షకీల, రామకృష్ణారెడ్డి, ఎం.ఆర్.నాయక్, షాకీర్ పాల్గొన్నారు.

బద్వేల్ : స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరిచడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కేంద్ర ఆదేశాలను తూచతప్పకుండా పాటిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రం ఎదుట మోకరిల్లి స్మార్ట్‌మీటర్లు అమరుస్తూ ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నారని విమర్శించారు. దశలవారి ఆందోళనలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, పట్టణ కార్యదర్శి కె. శ్రీను కార్యదర్శి వర్గ సభ్యులు చాంద్ బాషా, సిఐటియు కార్యదర్శి బాబు, పట్టణ కమిటీ సభ్యురాలు మోక్షమ్మ, ఆనంతమ్మ, సిఐటియు నాయకులు రమణ, ఓబులేసు, రాజగోపాల్, సభ్యులు చిన్ని, నాగార్జున, శరీఫ్, బాబయ్య, చిన్నయ్య గౌతమి బాలమ్మ ,రత్నమ్మ, మస్తాన్ బీ, డివైఎఫ్ఐ నాయకులుఆంజనేయులు గురయ్య సురేంద్ర సురేష్ పాల్గొన్నారు.

మోడీని గద్దె దించి దేశాన్ని రక్షించుకుందాం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



బహిరంగ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాశక్తి - కడప

దేశాన్ని రక్షించుకోవాలంటే నరేంద్ర మోడీని గద్దె దించాలని, రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడు కునేందుకు ప్రతి పౌరుడు నడుం బిగించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జాతీయ కార్యదర్శి మాజీ రాజ్యసభ సభ్యులు ఆర్జీస్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ చేపట్టిన సిపిఐ ప్రచార బస్సు యాత్ర బుధవారం రాత్రి కడపకు చేరుకుంది. ఆర్డీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. దేశాన్ని కాపాడుకోవాలంటే లౌకిక పార్టీలు, ప్రజాతంత్ర పార్టీలు కలవాలన్నారు. దేశంలోని దాదాపు 20 ఆరు రాజకీయ పార్టీలు ఛాలెంజ్ విసురుతున్నాయన్నారు. ఈనెల 31న ముంబైలో సమావేశం జరుగునుందన్నారు. ఈ దేశాన్ని కాపాడుకోవాలని ప్రతి ఒక్కరు నడుం బిగించాలని అన్నారు. కేంద్ర ంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కుల, మతాల మధ్య చిచ్చు పెడుతూ విధ్వంసం సృష్టిస్తుందని అన్నారు. ఇదంతా కేవలం రాజకీయ లబ్ధి కోసమే అన్నారు. భారత దేశంలో 21 కోట్ల ముస్లిం జనాభా ఉన్నారని, కేంద్రంలో ఒక్క ముస్లిము కూడా మంత్రి పదవి లేదన్నారు. 20 కోట్ల జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో 18 శాతం ముస్లిములున్నారని చెప్పారు. 424 ఎమ్మెల్యేలు ఉన్న ఆ రాష్ట్రంలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా అసెంబ్లీలో లేకపోవడం చాలా బాధాకరమన్నారు. దేశాన్ని బిజెపి ప్రభుత్వం మతం పేరుతో చీలిస్తుంది అన్నారు. దేశాన్ని కాపాడుకునేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇక రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి పాలన అధ్వానంగా ఉందన్నారు. నాలుగు సంవత్సరాల మూడు నెలల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. విద్యుత్ బిల్లులు ఆస్తి పన్ను చెత్త పన్ను పెంచారన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలపై రూ. 50 వేల కోట్ల భారం వేశారని వాపోయారు. దోచుకోవడం- దాచుకోవడాకేనా జగన్మోహన్ రెడ్డికి ప్రజలు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టింది అని ప్రశ్నించారు. గజదొంగల పాలన రాష్ట్రంలో సాగుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ఏ రంగంలో కూడా అభివృద్ధి చెందలేదని అన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని దివాలా తీశారన్నారు. ఇవాళ కోరుతనం ప్రభుత్వం రాష్ట్రంలో సాగుతుందని విమర్శించారు. కార్యక్రమంలో ఎఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర, నగర కార్యదర్శి వెంకట శివ, నాగ సుబ్బారెడ్డి, పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

చెన్నూరు : ప్రజా ఆరోగ్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతుందని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శివాలపల్లెలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలను సాగిస్తున్నారు అన్నారు. ప్రజా ఆరోగ్యానికి కోట్లాది రూపాయలు నిధులు ఖర్చు చేస్తూ ప్రతి సచివాలయ పరిధిలో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి సదుపాయం కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ నాగరాజు, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, ఎంపిపి చీర సురేష్ యాదవ్, ఉప మండల అధ్యక్షుడు ఆర్ ఎస్ ఆర్(చిన్న), మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జి.ఎన్ . భాస్కర్ రెడ్డి, సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, చిన్న కొండారెడ్డి, ఎంపిడిఒ సురేష్ బాబు, ఎఇలు మురళీకృష్ణ, మినీల్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

చేనేత, జౌళి శాఖ ఏడీకి సన్మానం

కడప : జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జి. నాగరాజరావును బుధవారం కలెక్టరేట్‌లోని డి- బ్లాక్‌లో ఆయన ఛాంబర్‌లో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు, కోశాధికారి టేకూరి సుదర్శన్, గౌర వాధ్యక్షులు పల్లా బాలచౌడన్న, ఉపాధ్యక్షులు బొలిశెట్టి వెంకటస్వామి మర్యా దపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాలో చేనేత కార్మికులకు అండగా నిలబడి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఏడీ చేనేత కార్మికుల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే తక్షణం పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నవీన్ చిన్నపిల్లల ఆస్పత్రి ప్రారంభం

కడప : డాక్టర్ నవీన్ కుమార్ సారథ్యంలో నాగరాజు పేటలోని ఎల్ఐసి బ్రాంచ్ సమీపంలో డాక్టర్ జగదీష్ న్యూరో కేర్ పక్కన నవీన్ చిల్డ్రన్స్ క్లినిక్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బందా నవీన్ కుమార్ మాట్లాడుతూ 14 సంవత్సరాల నుండి చిన్నపిల్లలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇకనుంచి నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. చిన్నపిల్లలకు, పురిటి పిల్లలకు అన్ని రకాల చికిత్సలు, వ్యాక్సిన్లు, నాణ్యమైన వైద్యుల సేవలు అందజేస్తామన్నారు. కోలార్ ఎన్‌డియు ఎంసిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్‌గా వైద్య సేవలు అందించడంలో తనకు చాలా సంతృప్తి కలిగిందన్నారు. కడప నగర వాసులందరూ తమ పిల్లలకు తమ నవీన్ చిల్డ్రన్స్ క్లినిక్ ద్వారా వైద్య సేవలు పొందాలని కోరారు. కార్యక్రమంలో బందా నారాయణ, బందా కవిత, డి. వెంకటరమణ, చంగా సంటయ్య, రబ్బా వీరన్న, ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, చారు రాజా, పల్లా మురళీకృష్ణ, బంధుమిత్రులు పాల్గొన్నారు.

దిశ చట్టంపై అవగాహన అవసరం

కడప : మహిళలు దిశ చట్టంపై అవగాహన అవసరమని దిశా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్లు మురళీమోహన్, వెంకటసుబ్బన్న అన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో బుధవారం కడప నగరం సాయిపేటలోని నగరపాలక ఉన్నత పాఠశాలలో 'మహిళల అక్రమ రవాణా, దిశ యాప్' పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దిశ చట్టం ద్వారా మహిళలకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్ని చట్టాలొచ్చినా ఇప్పటికీ చాలా దేశాల్లో మనుషుల అక్రమ రవాణా సాగుతూనే ఉంది అన్నారు. వివిధ దేశాల్లో మనుషుల అక్రమ రవాణా బాధితుల సంఖ్య లక్షల్లోనే ఉంటుంది అని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు పాల్గొన్నారు.



మైనార్టీల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు గఫూర్

మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. బుధవారం సిపిఐ బస్సు యాత్ర కడపకు చేరుకున్న సందర్భంగా ముస్లిం మైనార్టీ ఫంక్షన్ హాలులో ముస్లిం మైనార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం పేద జంటలకు ఇచ్చే షాదీతోఫా షరతులతో ఇస్తున్నారని విమర్శించారు. విద్యను దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టాప్ 100 యూనివర్శిటీలలో సీటు తెచ్చుకుంటేనే ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రామ కృష్ణ కళాశాల వద్దనున్న వక్ఫ్ స్థలం సజ్జల రామకృష్ణారెడ్డి ఆధీనంలోకి వెళ్లిపోయిందని తెలిపారు. ముస్లిం మైనార్టీ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఫారూక్ సిబ్లి మాట్లాడుతూ దుల్హన్ పథకం ద్వారా టిడిపి ప్రభుత్వం రూ.50వేలు ఇచ్చేదని తెలిపారు. జగన్ రూ. లక్ష ఇస్తామని చెప్పి అమలు చేయలేదని చెప్పారు. తాను కోర్టు వెళ్లి జడ్జిమెంట్ వచ్చే సమయంలో జిఒ తెచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులేసు, టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జీ అమీర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నజీర్ అహమ్మద్, జెఎసి కన్వీనర్ బాబుబాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఫరూక్, ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

నవంబర్‌లో 'కలియుగ పట్టణంలో' విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

కలియుగ పట్టణంలో సినిమా షూటింగ్ 50శాతం పూర్త యిందని, నవంబర్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తు న్నామని డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి అన్నారు. బుధవారం రాజీవ్‌పార్కులో జరుగుతున్న సినిమా షూటింగ్ సెట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో షూటింగ్ నిర్వహిస్తున్నామని, మన వారు ఎక్కువగా ఉన్నారని పేర్కొ న్నారు. ప్రజల నుంచి మంచి స్పందన ఉందని చెప్పారు. హీరో విశ్వకార్తికేయ మాట్లాడుతూ చక్కటి టీం పని చేస్తుందని, సినిమా బాగావస్తుందని తెలిపారు. హీరోయిన్ అయేష పటేల్ మాట్లాడుతూ 25 నుంచి షూటింగ్ చేస్తున్నామని, ప్రజలు స్వాగతించడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, డిఒపి చరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

కాంట్రాక్ట్ లెక్చరర్ల వయోపరిమితి పెంచాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రం లోని డిగ్రీ కళాశాలలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల వయోపరిమితి 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచాలని రూట రాష్ట్ర ఉర్దూ లెక్చరర్స్ వింగ్ వ్యవస్థాపకులు సయ్యద్ హిదాయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ వసీవుల్ల బక్తియారి కోరారు. బుధవారం కడప క్యాంపు కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషాకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలోని జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల వయోపరిమితి పెంచిన ప్రభుత్వం డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్ల వయోపరిమితి పెంచకపోవడం బాధాకరమని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి సమస్య తీసుకెళ్లి వెంటనే డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్ల వయోపరిమితి పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిగ్రీ అధ్యాపకులు డాక్టర్ జయరామి రెడ్డి, రెడ్డి బాషా పాల్గొన్నారు.

చీటికి మాటికి నోటీసులేంటి? : యుటిఎఫ్

బద్వేలు : చీటికిమాటికి పోలీసుల నోటీసులేంటని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. సెప్టెంబర్ ఒకటో తేదీ విజయవాడలో జరిగే 'వై నాట్ ఓపిఎస్' కార్యక్రమానికి హాజరు కావడానికి వీల్లేదంటూ పోలీసులు నోటీసులు జారీ చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, అప్పటి ప్రతిపక్ష నాయకుని హోదాలో తాను అధికారంలోకి వస్తే, వచ్చిన వారంలోపే ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ మాట నిజమని నమ్మి ముఖ్యమంత్రిగా గద్దెనెక్కడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరించారని పేర్కొన్నారు. జిపిఎస్ విధానం వల్ల ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదని తెలిపారు.

క్రమశిక్షణ కొరవడిన సమావేశం

పోరుమామిళ్ల టౌన్ : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలోని స్త్రీ శక్తి భవన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల ఎనిమిదవ సాధారణ సర్వసభ్య సమావేశంలో క్రమశిక్షణ కొరవడింది. సమావేశానికి వివిధ శాఖల నుంచి అధికారులు హాజరయి వారి వారి శాఖల పనితీరు, అభివృద్ధి గురించి సమీక్ష సమావేశంలో విశదీకరించారు. పలువురు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ కార్యదర్శులు కూడా ,సమావేశానికి హాజరయ్యారు. సమావేశం జరుగుతుండగానే విసుగు చెందిన కొంతమంది అక్కడ నుంచి మెల్లగా జారుకోవడం గమనార్హం. వేదిక మీద ఉన్న అధికారులు తహశీల్దార్, ఎంపిడిఒ, మండల ఉపాధ్యక్షుడు, జడ్‌పిటిసి సమావేశం నుంచి బయటకు వెళ్తున్న వారిని చూస్తూ ఉండడం తప్ప ఏమీ అనలేని, ఏమీ చేయలేని పరిస్థితి. మండల ఉపాధ్యక్షుడు సీబాషా మాత్రం సమావేశం పూర్తయ్యే వరకు ఎవరు వెళ్ళవద్దని పదేపదే చెప్పినప్పటికీ ఎవరూ కూడా పట్టించుకోలేదు.

పాత పెన్షన్ విధానం అమలయ్యే వరకూ పోరాటం

కడప అర్బన్ : ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకులుగా ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన వారం రోజులలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చి నేడు మాటతప్పి ఏకపక్షంగా సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ను అమలు చేయడానికి సిద్ధపడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. బుధవారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్ విధివిధానాలు ఏమిటో డ్రాఫ్ట్ విడుదల చేయకుండా, అందులో ఏముందో ఉద్యోగులకు చెప్పకుండా ఏకపక్షంగా, నిరంకుశంగా అమలు చేయడాన్ని నిరసించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2004కు ముందు నియామకపు ప్రక్రియ పూర్తైన 11వేలమందికి పాత పెన్షన్ విధానం అమలు చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో ఉన్న 3లక్షలమంది సిపిఎస్ ఉద్యోగులు పాత పెన్షన్ విధానాన్నే కోరుతున్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ముఖ్యమంత్రి తన విశ్వసనీయతను నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్, గోపీనాథ్, బాబు అయ్యవారు రెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పంట ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

వర్షాధారం కింద సాగైన పంటలలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎఒ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. చింతకుంట గ్రామంలో ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ రైతులతో మాట్లాడుతూ వేరుశనగ పంట ఎండి పోకుండా ఉండేందుకు 20 గ్రాములు యూరియా లేదా పొటాషియం నైట్రేట్ 20 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. దీంతో పంట 15 రోజుల వరకు బెట్టకు గురికాకుండా ఉంటుందన్నారు. వేరుశనగ పంటలో ఇనుప ధాతువు లోపం కనిపిస్తుందన్నారు. దీని నివారణకు అన్నబేది 5 గ్రాములు, నిమ్మఉప్పు 2 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే పంటను కాపాడుకోవచ్చన్నారు. పంట పూత దశలో ఉన్నప్పుడు తప్పనిసరిగా ఎకరానికి 200 కిలోల జిప్సం చల్లి, నీరు పెడితే మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పొద్దుతిరుగుడు పంటను పక్షుల బారి నుండి కాపాడుకోవడానికి గట్టు వెంబడి మెరుపు రిబ్బన్లు కట్టుకోవాలని ఎఒ సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

వంట గ్యాస్ తగ్గింపు తాత్కాలిక ఎన్నికల స్టంట్

\- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.200 ధరను తగ్గిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తాత్కాలిక ఎన్నికల స్టంట్ మాత్రమేనని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. వేంపల్లెలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో రాజస్థాన్, ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మిజోరం అసెంబ్లీలకు సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. మహిళా ఓటర్లను తాత్కాలికంగా మభ్య పెట్టడానికి గ్యాస్ సిలిండర్ తగ్గింపు నిర్ణయాన్ని బిజెపి తీసుకుందని విమర్శించారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఖచ్చితంగా వంట గ్యాస్ ధరను పెంచుతుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో వంట గ్యాస్ ధర విపరీతంగా ఉన్నప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.410కే సరఫరా చేసేదని చెప్పారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో వంట గ్యాస్ ధర గణనీయంగా తగ్గినా మోడీ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రూ.410కే వంట గ్యాస్ సరఫరా చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేస్తున్న విషయాన్ని తులసిరెడ్డి గుర్తు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ధ్రువకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, రాఘవయ్య, ఉత్తన్న, అమర్, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, శివ, శివారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌విడిసి ఎన్‌సిసి విద్యార్థులచే రక్షాబంధన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరి నారాయణకు రాఖీ కట్టారు. మన పట్టణానికి రక్షణ కలిగిస్తున్న సిఐలు, ఎస్ఐలు, పోలీసులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లా డుతూ అన్నాచెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక రక్షాబంధన్ పండుగ. కుటుంబ బాంధవ్యాలకు అధిక ప్రాధాన్యమిచ్చే మన భారతీయులకు శ్రావణ పౌర్ణమినాడు వచ్చే ఈ రాఖీ పండుగ ఒక ఆనందాల వేడుక అన్నారు. కళాశాల కో-ఆర్డినేటర్ గౌరీశంకర్, ఎన్‌సిసి ట్రైనర్ దావీద్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** సోదర సౌభ్రాతృత్వానికి ప్రతీక రక్షాబంధన్ అని స్థానిక ఓంశాంతి భవన్ నిర్వాహకులు బి.కె.శాంత తెలిపారు. రక్షాబంధన్ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి, ఎస్.రఘురామిరెడ్డికి రాఖీ కట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారుమునిరెడ్డి, పిట్టా బాలాజీలకు కూడా రాఖీ కట్టారు. ఆర్‌టిపిపిలో కూడా బ్రహ్మకుమారీలు అధికారులకు రాఖీలు కట్టారు. **పులివెందుల రూరల్ :** రక్షాబంధన్ వేడుకలు సోదర భావానికి ప్రతీకగా నిలుస్తాయని ఎంపీ అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీ అవినాష్ రెడ్డి నివాసంలో బ్రహ్మకుమారీస్ కౌన్సిలర్ లక్ష్మీ భార్గవి రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పురాణాల్లో సైతం రాఖీ పౌర్ణమికి ఎంతో విశిష్టత ఉందన్నారు. పూర్వం రాజులు యుద్ధానికి వెళ్లేటప్పుడు తమ భర్తలు క్షేమంగా తిరిగి రావాలని అప్పట్లో వారి సతీమణులు రాఖీలు కట్టి పంపేవారని చరిత్ర చెబుతోందన్నారు. జిల్లా ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఒపిఎస్ తప్ప వేరే ప్రత్యామ్నాయం వద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఒపిఎస్ తప్ప వేరే ప్రత్యామ్నాయం వద్దని ఎస్‌టిఐఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ స్పష్టం చేశారు. స్థానిక సంఘం కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లా డుతూ సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధా నాన్ని మాత్రమే కొనసాగించాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ముఖ్యమంత్రి మాట నిలుపుకోవాలన్నారు. ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దు చేయాలని, లేని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయులతో కలిసి జిల్లాలో జరిగే సిఎం సభను అడ్డుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా కార్య దర్శి రామ్మోహన్, ఒపిఎస్ జిల్లా కన్వీనర్ నరేష్, స్థానిక సంఘ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుబ్బరాజు యాదవ్

గడ్డివామి దగ్ధం

వేంపల్లె : పులివెందుల రోడ్డులో అగ్నికి గడ్డివామి దగ్ధమైంది. శ్రీను అనే వ్యక్తి నిమ్మకాయల పార్సిల్ కోసం గడ్డివామి పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు పెద్దగా రావడంతో అగ్ని మాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోగా స్థానికులు మహమ్మద్, మారుతి, వేమాలతో పలువురు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి పూర్తిగా మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.40వేలు నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. అగ్నిమాపక సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వెంకటసుబ్బయ్య, భీమాంజినేయులు, ఉత్తమారెడ్డి, ప్రభాకర్‌రావు, సంజీవరెడ్డి, డ్రైవర్ చిన్న పెద్దయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని సాయిబాబా గుడి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ వర్మ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 35 నుంచి 40 ఏళ్ల వయసుగల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో ఎవరు అనే వివరాలు తెలియ రాలేదన్నారు. టీ షర్టు వేసుకుని గుండుతో ఉన్నాడని ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించామన్నారు. వివరాలు తెలిస్తే 94409 00811 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

పెద్దముడియం : మండలంలోని జె కొత్తపల్లి గ్రామంలో తంగేళ్ల బీనా (29) అనే మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బీనా భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. కర్నూలు పట్టణంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో కేర్ టేకర్ గా పనిచేస్తూ ఉండేది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జె.కొత్తపల్లెలోని తన తల్లిదండ్రుల వద్దనే ఉంటూ వైద్యం చేయించుకునేది. తన అనారోగ్య పరిస్థితులపై కలత చెందిన బీనా తల్లిదండ్రులు కూలి పనికి వెళ్లగానే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలికి చేరుకొని వైద్య పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

నిరుపయోగం.. వ్యర్థ పదార్థాలు నింపే తొట్లు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో 22 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన వ్యర్థ పదార్థాల నుండి సంపద సృష్టి కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన తొట్లు నిరుపయోగంగా మారాయి. గ్రామాలలో ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి వ్యర్థ పదార్థాలు ఎక్కడా ఉండకూడదని 2018లో స్వచ్ఛభారత్‌లో భాగంగా సంపద నుండి సృష్టి కేంద్రాలను 22 గ్రామపంచాయతీలో ఏర్పాటు చేశారు. వీటికి అనుసంధానంగా సిమెంట్ ఇటుకలతో ఒక్కో పంచాయతీలో 20కిపైగా తొట్లను ఏర్పాటు చేశారు. వ్యర్థ పదార్థాలను ఇళ్ల వద్ద నుండి సేకరించి గ్రీన్ అంబాసిడర్లు తొట్లలలో తడి, పొడి చెత్తగా వేయాల్సి ఉంటుంది. వీటి ద్వారా ఎరువులు తయారు చేసి రైతులకు అమ్మకాలు చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే వీటి నిర్వహణకు ప్రతి ఇంటికి రోజుకు రెండు రూపాయల వంతున వసూలు చేయాలని భావించారు. ఇది క్షేత్రస్థాయిలో అమలు చేయడం సాధ్యం కావడం లేదు. గ్రీన్ అంబాసిడర్‌లను నియమించి వేతనాలు కూడా అరకొరగా చెల్లిస్తున్నారు. ఉన్నతాధికారులు పథకాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నా కింది స్థాయిలో వివిధ కారణాలతో ఆచరణకు నోచుకోవడం లేదు. టిడిపి హయాంలో నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలు దెబ్బతినడంతో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి మరమత్తులు చేపట్టి పెండింగ్ పనులను చేపట్టి రంగులు వేసి పథకాన్ని మళ్లీ ప్రారంభించారు. వీటి నిర్మాణాలను ప్రారంభించి అయిదేళ్లు పూర్తయినప్పటికీ పథకం అమలు జరగకపోవడంతో తొట్లలో మొక్కలు మొలిచాయి. ఇప్పటికైనా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొస్తే ప్రభుత్వం భావించిన స్వచ్ఛభారత్ సంకల్పం అమలుకు నోచుకుంటుంది. చాపాడు మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలోని చెత్త నుండి సంపద కేంద్రంలో ఎరువులు తయారు చేసి కొంత కాలం అమ్మకాలు చేపట్టారు. ప్రస్తుతం అక్కడ కూడా కార్యక్రమం కొనసాగడం లేదని తెలుస్తోంది.



రేపటి నుంచి 'భవిష్యత్తుకు గ్యారెంటీ' : టిడిపి


మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

టిడిపి మేనిఫెస్టో భవిష్యత్ గ్యారెంటీ.. చంద్రబాబు గ్యారెంటీ కార్యక్రమంలో హామీ పత్రాలుగా ఇవ్వనున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుండి భవిష్యత్ గ్యారెంటీ ఇది బాబు గ్యారెంటీ కార్యక్రమం 45 రోజులపాటు జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో 45రోజులపాటు జరుగుతున్నట్లు తెలిపారు. టిడిపి ప్రధాన నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, కమిటీ సభ్యులు, సామాజిక సాధికార కమిటీలు పాల్గొంటారని పేర్కొన్నారు. తల్లికి వందనం అనే పథకం కింద ప్రతి ఏటా రూ.15 వేలు చదువుకునే ప్రతి విద్యార్థికి అందించనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ప్రకారం ఏడాదికి రూ.18,000 వేలు, రైతులకు రూ.20 వేలు, యువగళం నిరుద్యోగ భృతి కింద ఒకొక్కరికి ప్రతినెల రూ.3000 వేలు, దీపం పథకం కింద ప్రతి ఇంటికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, జిల్లాల వారీగా ఆయా జిల్లాల్లో నివసించే మహిళలకు జిల్లా వ్యాప్తంగా ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం, నీటి కుళాయి లేని నివాస ఇళ్లకు ఉచిత కొళాయి కనెక్షన్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. పేదల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే తమ ముందున్న లక్ష్యంగా పై పథకాలను అమలు చేస్తామన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ, మండలస్థాయిలో ప్రతి పల్లెలలోని ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి, ఆయా పథకాలకు అర్హులను గుర్తించి వారికి హామీ పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి ఎన్నికలో ఇచ్చే మ్యానిఫెస్టోలకు భిన్నంగా హామీ పత్రాన్ని టిడిపి విడుదల చేస్తున్నట్లు లింగారెడ్డి తెలిపారు. మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి, అడ్వకేట్ సుబ్బయ్య, సిద్దయ్య పాల్గొన్నారు.

భయభ్రాంతులకు గురిచేస్తున్న 'దేవగుడి' కుటుంబం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి రాబోవు ఎన్నికల్లో గెలవాలని దేవగుడి కుటుంబం భావిస్తోందని జమ్మలమడుగు వైసిపి యువ నాయకులు ధీరజ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ అయిదేళ్లుగా జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎలాంటి ఫ్యాక్షన్ రాజకీయాలకు తావు లేకుండా ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ప్రయత్నిస్తుంటే.. స్థానిక టిడిపి ఇన్‌ఛార్జి దేవగుడి భూపేష్‌రెడ్డి మాత్రం ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ అనుమతులతో ఇసుక రవాణా చేస్తున్న తనపై రౌడీ మూకలను ప్రేరేపించడం సరైంది కాదన్నారు. గతంలో దేవగుడి కుటుంబం ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. 11వ వార్డు కౌన్సిలర్ పోచిరెడ్డి మాట్లాడుతూ 15ఏళ్ల నుంచి పెన్నా నదిలో ఇసుకను అక్రమంగా తరలించింది ఎవరనే సంగతి జమ్మలమడుగు ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. 10వ వార్డు ఇన్‌ఛార్జి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ దళితులు అంటే దేవగుడి కుటుంబానికి చులకన భావం ఏర్పడిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దన్నవాడ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్ మాటలను నమ్మి టిడిపి నాయకులు అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడుతూ మెప్పు కోసం ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న జమ్మలమడుగు నియోజకవర్గాన్ని టిడిపి నాయకులు దౌర్జన్యాలు చేస్తున్నారని, అలాంటి ప్రయత్నాలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఉన్నంతవరకు జరగవని ఆయన ఘాటుగా స్పందించారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి డిపాజిట్లు కూడా దక్కవని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ఆకుల బాబా, సుబ్బారావు, కొండాపురం యూత్ వింగ్ కన్వీనర్ లక్ష్మికాంత్‌రెడ్డి, దుద్యాల రమేష్, సింగరయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా


సర్పంచు నాగమ్మను సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సర్పంచు నాగమ్మ పేర్కొన్నారు.వీరన్నగట్టుపల్లె, మారుతినగర్ ఇడుపులపాయ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతామని నూతనంగా ఎన్నికైన సర్పంచు తుమ్మలూరు నాగమ్మ తెలిపారు. ఇడుపులపాయ సచివాలయంలో బుధవారం ఆమె సర్పంచుగా ప్రమాణస్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టారు. అనంతరం నాగమ్మను ఎంపిపి లక్ష్మీగాయత్రి, గ్రామ సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, గృహ సారథులు, వార్డు మెంబర్లు, వాలంటీర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తనకు సర్పంచుగా చేసినందుకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్ర ఓబుల్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసిపికి ఎల్లప్పుడు రుణపడి ఉంటానని ఆమె చెప్పారు. పంచాయతీ అభివృద్ధికి వార్డు మెంబర్లుతోపాటు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఇటీవల ఎన్నికైన వార్డు మెంబర్ కోలా శ్రీరాములు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాయలసీమ కాపునాడు యవజన సంఘం అధ్యక్షుడు కావలి కృష్ణతేజ, నాయకులు దర్బార్, చాను బాషా, గోపి, శ్రావణ్‌కుమార్, వార్డు మెంబరు పాల్గొన్నారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం నల్లచెరువుపల్లె గ్రామంలో తీవ్ర వర్షాభావంతో ఎండిపోయిన పత్తి, వేరుశనగ పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యంగా పులి వెందుల నియోజకవర్గంలో ఇప్పటివరకు భూమి మీద చినుకు పడలేదని, జులైలో వేముల మండలంలోని నల్లచెరువుపల్లె, కొండ్రెడ్డిపల్లె, తదితర గ్రామాల్లో పదును వర్షం కురవడంతో రైతులు పత్తి, వేరుశనగ పంటలను సాగు చేశారన్నారు. అయితే ఇంతవరకు వరుణదేవుడు కరుణించకపోవడంతో ఆ పంటలు నిలువునా ఎండిపోవడం చాలా బాధాకరమన్నారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఏ రైతు కూడా ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. పంట సాగు చేసిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందిస్తామని ఎంపీ రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాడా ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ఎంపిపి చల్ల గంగాదేవి, జడ్‌పిటిసి బయపురెడ్డి, మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, మండలంలోని ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న ఎంపీ

క్రీడోత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం-ఆంధ్రా క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పాడా కార్యాలయంలో పులివెందుల, తొండూరు, లింగాల, సింహాద్రిపురం, వేముల, వేంపల్లి, చక్రాయపేట ఎంపిడిఒలు,, తహశీల్దార్లు, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, సచివాలయ కన్వీనర్‌లకు క్రీడోత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 15 ఏళ్లకు పైబడిన అన్ని వయసుల వారిని క్రీడల్లో భాగస్వామ్యం చేయాలని కోరారు. అలాగే క్రీడల నిర్వహణలో సర్పంచు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, మండల అధికారులు అందరూ కలిసికట్టుగా కృషి చేసి సచివాలయాలు, మండలస్థాయి, నియోజకవర్గస్థాయిల్లో పోటీలు విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 2న ఈ పోటీలను రాష్ట్రస్థాయిలో సీఎం లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో టీంలు తయారు చేసి సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. వీటన్నిటిపై ఇక్కడ చర్చించిన అంశాలు ఆయా మండలాల్లో ఎంపిడిఒలు, తహశీల్దార్, ఎస్ఐ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించుకొని టీంలు సిద్ధం చేయాలని కోరారు. సమావేశంలో ఆర్‌డిఒ వెంకటేశులు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, సిఎం కార్యాలయ తహశీల్దారు రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో నిర్వహించనున్న "ఆడుదాం ఆంధ్ర" కార్యక్రమ కమిటీ సభ్యులు తగు సహకారం అందించి జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ కోరారు. ఆడుదాం ఆంధ్ర పట్టణ కమిటీతో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పట్టణ క్రీడాకారులను గుర్తించి టీంను ఏర్పాటు చేయడంలో జడ్‌పి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ తీసుకొని అత్యుత్తమ టీంను ఎంపిక చేయాలని కోరారు. క్రీడాస్థలాన్ని కూడా పరిశీలించాలని కమిటీ సభ్యులకు సూచించారు. క్రీడాకారులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సభ్యులను కోరారు. సమావేశంలో ఎంఇఒ వెంకటేశులు, జెడ్‌పి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, పిఇటి నాగార్జున, మున్సిపల్ ఎఇ సురేష్, ఎఎస్ఐ రాజరెడ్డి, మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య, మెప్మా సిఒ వసంత్, డిపిఒ వినోద్ పాల్గొన్నారు.

ప్రహరీ మంజూరు చేయాలని వినతి

ముద్దనూరు : ఉప్పలూరు గ్రామంలో ఉన్న అతి పురాతనమైన మసీదు శ్మశానవాటికకు ప్రహరీ మంజూరు చేయాలని గ్రామ ముస్లింలు కడపలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో బుధవారం ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషాకు వినతిపత్రమిచ్చారు. ఉప్పలూరు గ్రామంలో 665 ఏళ్ల క్రితం నాటి మసీదు ఉందన్నారు. దీనికి సంబంధించిన శ్మశాన వాటికకు ప్రహరీ లేదన్నారు. ఇందుకు ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధు, మాబాషా, దస్తగిరి, మహబూబ్, బాషా, రియాజ్, బాషా పీరయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

తొలగించిన శిలాఫలకాలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని సింహాద్రిపురం-పులివెందుల ప్రధాన రహదారిలోని అగ్రహారం సమీపంలో రోడ్డు పక్కన పడేసిన శిలాఫలకాలను ఉపాధి హామీ చట్టం సిబ్బంది అక్కడి నుంచి తీసేశారు. బుధవారం 'ప్రజాశక్తి' దిన పత్రికలో 'శిలాఫలకాల ఏర్పాటులో నిర్లక్ష్యం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు ఉపాధి హామీ సిబ్బంది స్పందించి, హడావుడిగా రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా పడేసిన శిలాఫలకాలను తీసేసి, క్షేత్రస్థాయిలోని అభివృద్ధి పనుల వద్దకు తరలించారు.


రోడ్డు పక్కన పడేసిన శిలాఫలకాలను తొలగించిన ప్రదేశం

టిడిపికి పెరుగుతున్న ఆదరణ

ప్రజాశక్తి - చాపాడు

టిడిపికి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. వనిపెంట గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 రోజుల పాటు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ ఓటు వేసిన కార్యకర్తలను ఎమ్మెల్యే అణచివేసి దూరం పెట్టి మోసం చేశారన్నారు. రావాలి జగన్.. కావాలి జగన్ అని ఒక్కసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తామని చెప్పిన జగన్.. అధికారంలోకి వచ్చాక దాన్ని మరిచిపోయి రాష్ట్రాన్ని అధోగతిపాల్జేశారన్నారు. వైసిపి పాలనలో దౌర్జన్యం పెరిగిందన్నారు. అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారని పుట్టా ఆరోపించారు. అనంతరం మైదుకూరు మండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ 3వ వార్డు సభ్యుడు ఆకుల శేఖర్ రాయల్ వనిపెంటలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షులు భీమయ్య, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు చీకిరి చిన్న వెంకటసుబ్బయ్య, మైనారిటీ నాయకులు ఇస్మాయిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

పాఠశాలల్లో హాజరు పట్టికలు తెలుగులో రాయాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో సెప్టెంబర్ 1నుంచి హాజరు పట్టికలను తెలుగులో రాయాలని ఎపి అధికార భాష సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు తెలుగు భాష వికాస వారోత్సవాలు ఘనంగా నిర్వహించిన అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలల్లో అధికార భాష సంఘం పిలుపును అందుకొని గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా వారోత్సవాల్లో పాలుపంచుకున్నారన్నారు. ఉత్సవాల్లో చూపిన శ్రద్ధ, భక్తి తెలుగు భాష అమలులో కూడా చూపాలన్నారు. త్వరలోనే అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో తాను క్షేత్ర పర్యటన చేయబోతున్నట్లు వివరించారు. ఎవరైనా హాజరు పట్టీలు తెలుగులో రాయకపోతే వారిపై జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని ఇదివరకే జిల్లాలోని అన్ని పాఠశాలలకు, ఎంఇఒలకు అధికారిక లేఖ ద్వారా తెలియజేశామన్నారు. దీన్ని తక్షణమే అమలు జరపాలని ఆయన కోరారు.

సంస్థను స్థాపించేలా ఆలోచించాలి

ప్రజాశక్తి - చాపాడు

తామే ఓ సంస్థను స్థాపించేలా ఆలో చించాలని సిబిఐటి కళాశాల చైర్మన్ డాక్టర్ వి.జయ చంద్రారెడ్డి సూచించారు. సిబిఐటి కళాశాలలో బుధవారం ఎంబిఎ చివరి సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రార్థన గీతం ఆలపించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంబిఎ విద్యార్థులు కేవలం ఒకే ఉద్యోగంలో స్థిరపడకుండా తామే ఒక సంస్థను స్థాపించేలా ఆలోచించాలన్నారు. సమాజానికి సేవ చేసేలా ఉంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. తల్లి దండ్రులకు తాము చదివిన సంస్థకు మంచి పేరు తీసుకు రావా లని ఆకాంక్షించారు. విద్యార్థులు చైర్మన్, ప్రిన్సిపల్‌ను ఘనంగా సన్మానించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో కిడ్నాప్ కలకలం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని మాలపాడు గ్రామానికి చెందిన ఆదిరెడ్డి శ్రీనివాసులరెడ్డిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారనే వార్త మండలంలో కలకలం రేపింది. గంగవరం శేఖర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు శ్రీనివాసులురెడ్డి బుధవారం సాయంత్రం ప్రొద్దుటూరు సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయాల వద్ద ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుండి కారుతో ఢీ కొట్టినట్లు సమాచారం. కింద పడిన శ్రీనివాసులరెడ్డిని కారులో ఎక్కించుకొని తీసుకెళ్లి కొట్టి, చంపుతామని బెదిరించినట్లు తెలిసింది. గంట తర్వాత వదిలేసినట్లు సమాచారం. కిడ్నాప్ ఉదంతంపై పోలీసులకు కూడా ఎలాంటి సమాచారం లేదు. దీనిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని జయమ్మ కాలనీలో వైద్యాధికారి డాక్టర్ జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. మలేరియా, డెంగీ వ్యాధుల గురించి ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లడుతూ ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలన్నారు. ఆశా కార్యకర్తలు హుసేన్ బీ, సులోచన పాల్గొన్నారు.